
24న ఆయిల్ పామ్ రైతులకు శిక్షణ

హుజూరాబాద్, మే 21: ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు జమ్మికుంట కేవీకేలో ఈ నెల 24న శిక్షణ ఇస్తున్నట్లు జీకే రైతుమిత్ర సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గూడూరి స్వామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయిల్ పామ్ సాగులో తీసుకోవాల్సిన సమగ్ర సస్య రక్షణ చర్యలు, ఎరువుల, నీటి యాజమాన్య పద్ధతుల గురించి తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫామ్ కంపెనీ సలహాదారుడు రంగనాయకులు అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యావన, పట్టుపరిశ్రామిక, వ్యవసాధికారులు పాల్గొంటారని తెలిపారు.







భద్రతపై పట్టింపేది?

ఆర్టీసీ బస్టాండ్‌లో పని చేయని సీసి కెమెరాలు

- కరీంనగర్ బస్టాండ్‌లో పని చేయని సీసీ కెమెరాలు
- తరచూ దొంగతనాలు
- ఆందోళనలో ప్రయాణికులు

కరీంనగర్ క్రైం, మే 21: ఉత్తర తెలంగాణలోనే అత్యధిక రద్దీగా ఉండే కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణీకుల భద్రతను గాలికి వదిలేశారు. ఆదాయంపై ఉన్న శ్రద్ధ ప్రయాణీకుల భద్రతపై చూపించడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.ప్రతి రోజు కిక్కిరిసిన ప్రయాణీకులతో రద్దీగా ఉండే కరీంనగర్ బస్టాండ్‌లో నిఘా లోపాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. బస్టాండ్‌లో తరచూ ప్రయాణికుల బ్యాగ్‌లు, సెల్‌ఫోన్‌లు, పర్సులు దొంగతనాలకు గురవుతూనే ఉన్నాయి. ప్రయాణికులకు భద్రత కల్పించే చర్యలు చేపట్టడంలో ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల కరీంనగర్‌లోని మతాతాశిశు కేంద్రంలో ఒక శిశువును మహిళ అపహరించుకుపోగా ఆమె బస్టాండ్‌కు వచ్చి బస్సులో వెళ్లింది. ఆ వివరాల కోసం బస్టాండ్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించగా పనిచేయలేదు. అంతకుముందు గోదావరిఖని నుంచి ఒక వృద్ధురాలు కరీంనగర్‌కు వచ్చి బస్సుదిగి ప్లాట్‌ఫాం వద్దకు వెళుతున్న సమయంలో బ్యాగ్ చూసే సరికి తెరచి ఉంది. బ్యాగ్‌లోని 18 తులాల బంగారు ఆభరణాలు దొంగతనానికి గురయ్యాయ. ఈ ఘటనలో కూడా పోలీసులు బస్టాండ్‌కు వెళితే సీసీ కెమెరాలు పనిచేయటంలేదని సమధానం వచ్చింది.

● నాలుగేళ్ల క్రితం 72 సీసీ కెమెరాల ఏర్పాటు

బస్టాండ్‌లో దొంగతనాలతోపాటు రాత్రి సమయాల్లో అసాంఘీక కార్యకలాపాలు కూడా అధికమయ్యాయనే విమర్శలు వస్తున్నాయి. ఆర్టీసీ బస్సుల్లో అధికశాతం పేద, మధ్య తరగతి వర్గాలకు చెందినవారే ప్రయాణాలు సాగిస్తుంటారు. ఈ వర్గాలకు చెందిన ప్రజలే బాధితులుగా మారుతూ ఇబ్బందులకు గురవుతున్నారు. నాలుగేళ్ల క్రితం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ మొత్తం కవర్ చేస్తూ 72 సీసీకెమెరాలను ఏర్పాటు చేసి, బస్టాండ్ కాంప్లెక్స్‌లోనే ఒక కమాండ్‌కంట్రోల్‌రూంను ఏర్పాటు చేశారు. బస్టాండ్‌లో అవుట్‌పోస్ట్ ఏర్పాటు చేసి ఇద్దరు హోంగార్డులను 24 గంటలు విధులలో ఉండేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం కరోనా కారణంగా అవుట్‌పోస్టును ఎత్తివేశారు.

● నిర్వహణ లేక మూలనపడ్డ కెమెరాలు..

బస్టాండ్‌లోని సీసీ కెమెరాల నిర్వహణ బాధ్యతను కరీంనగర్ బోయవాడలోని ఒక సీసీకెమెరాల సంస్థకు అప్పగించారు. సీసీ కెమెరాల మరమ్మతుల ఖర్చుల చెల్లింపు బిల్లులు చెల్లించకపో వడంతో ఆ సంస్థ నిర్వహణ బాధ్య తల నుంచి తప్పుకుంది. దీంతో అప్పటి నుంచి సీసీ కెమె రాలకు మరమ్మత్తులు నిర్వహించకపోవటంతో బస్టాండ్ ఆవరణ లోని 52 సీసీ కెమెరాలు పనిచేయకుండా పోయా యి. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో బస్టాండ్‌లో జరిగే చోరీలు, పోకిరీల వేధింపులు, అసాంఘిక కార్యకలాపాల సమాచారం, నిందితులను గుర్తించే వీలు లేకుండా పోతున్నది. కరీంనగర్ నుంచి ప్రతిరోజు లక్షా 20 వేల మంది వరకు ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు తమ ప్రయాణాలను సాగిస్తుంటారు. ప్రయాణికుల రవాణాతో భారీగా ఆదాయం సమకూరుతున్నది. అయినా సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించడం లేదు. గతంలో బస్టాండ్‌లోని సీసీ కెమెరాల ద్వారా చాలా కేసుల్లో నిందితులను పోలీసులు గుర్తించి పట్టుకున్న సందర్భాలున్నాయి.



ఆర్టీసీ బస్టాండ్

త్వరలోనే సీసీ కెమెరాలను పునరుద్ధరిస్తాం

- రజనీ కృష్ణ, కరీంనగర్ డిపో ట్రాఫిక్ మేనేజర్

కరీంనగర్ బస్టాండ్ ఆవరణలో ఉన్న కొన్ని సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. వీటి మరమ్మత్తులు, కొత్తగా ఏర్పాటు చేసే సీసీ కెమెరాల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే సీసీకెమెరాలను పునరుద్ధరిస్తాం. బస్టాండ్‌లో ప్రయాణికుల భద్రతకు అన్నిరకాల చర్యలు తీసుకుంటాం.

లక్ష్యాన్ని సాధించేందుకు కఠినంగా శ్రమించాలి

- 9న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు హాజరవ్వండి
- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ కల్చరల్, మే 21: అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు పోటీ పరీక్షల కోసం అభ్యర్థులు కఠోరంగా శ్రమించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. వారధి సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రూప్-1 అభ్యర్థులకు నిర్వహించిన ఉచిత తొలి మాక్ టెస్ట్‌ను ఆమె మంగళవారం పరిశీలించారు. ఎంత మంది అభ్యర్థులు హాజరవుతున్నారని, ఎన్ని టెస్ట్‌లు పెడుతున్నారని అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జూన్ 9న జరుగనున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు అభ్యర్థులు అందరూ హాజరు కావాలని అన్నారు. గ్రంథాలయంలో చేపడుతున్న నూతన భవన నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సుమారు 300 మంది మాక్ టెస్ట్‌కు హాజరయ్యారని, ఈ నెల 25, 29, జూన్ 3, 7 తేదీల్లో మరో నాలుగు మాక్ టెస్ట్‌లు నిర్వహించనున్నట్లు వారధి, గ్రంథాలయ సంస్థ బాధ్యులు కలెక్టర్‌కు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జ్, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, వారధి సొసైటీ సెక్రెటరీ జి ఆంజనేయులు, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సరిత, సిబ్బంది పాల్గొన్నారు.



గ్రూప్-1 పోటీ పరీక్షల అభ్యర్థుల మాక్ టెస్ట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, పాల్గొన్న అధికారులు

ఉపాధి పనులకు ప్రణాళికలు సిద్ధం

- కూలీలందరికి పనులే లక్ష్యం
- అందరికి పనిదినాలు కల్పించేందుకు చర్యలు



చేగుర్తిలో చెరువు కట్ట పనులు చేస్తున్న ఉపాధి హామి కూలీలు

కరీంనగర్ రూరల్, మే 21: గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించి స్థానికంగా పనులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు చేస్తోంది. ఎక్కువ కుటంబాలకు వంద రోజుల పని కల్పించే లక్ష్యంతో అధికారులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. కరీంగనర్ మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో 6,550 మంది ఉపాధి హామీ కూలీలున్నారు. వీరిలో 5,547మంది పని చేసున్నారు. మంగళవారం 2,118 మంది పనులు చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1.25 లక్షల పని దినాలను కూలీలకు కల్పించాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు ఇప్పటి వరకు 40,143 మందికి పనిదినాలు కల్పించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన బడ్జెట్ మేరకు ఇప్పటికి 53 శాతం వరకు ఇప్పటికే పని దినాలు పూర్తయ్యాయి. అత్యధికంగా మొగ్దుంపూర్‌లో 7,576 పనిదినాలు కల్పించగా, బొమ్మకల్‌లో 6,400, గోపాల్‌పూర్‌లో 4,763, చెర్లబూత్కూర్ 4,655 , బొమ్మకల్‌లో 6,400, చామనపల్లిలో 4,848, ఎలబోతారం 4,210, నగునూర్ 4,991 పనిదినాలను కల్పించారు. గత సంవత్సరంలో 4,316 కుటుంబాలు ఉపాధి హామీ పనుల్లో పాల్గొనగా మొత్తం 409 కుటంబాలు వంద రోజుల పనిని పూర్తి చేసుకున్నాయి. అత్యధికంగా చామనపల్లిలో 73, చేగుర్తిలో 64, జూబ్లీనగర్‌లో 48, ఎలబోతారంలో 36, గోపాల్‌పూర్‌లో 33, ఇరుకుల్లలో 31, దుర్శేడ్ 27, నగునూర్‌లో 23 కుటుంబాలున్నాయి.

● 5.25 కోట్లతో పనులు

2024-25 ఆర్థిక సంవత్సరంలో 5.25 కోట్ల రూపాయలతో పనులు చేపట్టేందుకు అధికారులు గ్రామాల వారీగా ప్రణాళికలు రూపొందించారు. మొత్తం 540 పనులు మంజూరయ్యాయి. పనుల ద్వారా కూలీలకు 1.25 లక్షల పని దినాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు. వ్యవసాయ అనుబంధ పనులు, నీటి నిల్వ, భూగర్భ జలాలు పెంపొందించే పనులకు ప్రాధాన్యతమిచ్చారు. రైతుల భూము లకు సార వంతమైన మట్టి తరలింపు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనులు ఏప్రిల్ 1 నుంచి ప్రారంభ మయ్యాయి. వేసవి కాలంలో మండల వ్యాప్తంగా ప్రతి రోజు గ్రామానికి 150 మంది కూలీ లకు పని కల్పించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉండగా 130 మందికి పనులు కల్పించారు.

లక్ష్యాన్ని చేరుకుంటాం...

-శోభారాణి, ఉపాధి హామీ ఏపీవో



ఈ ఆర్థిక సంవత్సరానికి విడుదలైన బడ్జెట్, పనిదినాల్లో వంద శాతం లక్ష్యాన్ని చేరుకుంటాం. గత సంవత్సరం లక్ష్యానికి అనుగుణంగా కూలీలకు పనులు కల్పించాం. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 1.51 లక్షల పనిదినాల లక్ష్యంగా పెట్టుకోగా 1,49,170 పనిదినాలు కల్పించి 99 శాతం లక్ష్యాన్ని చేరుకున్నాం.

నేడు నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, మే 21: నగరంలో చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు టౌన్ వన్ ఏడీఈ సాయినేని నరేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. గాంధీ ఫీడర్, వరలక్ష్మి ఫీడర్ పరిధిలోని గాంధీ రోడ్, హుస్సేనిపురా, శర్మానగర్, అశోక్ నగర్, సీతారాంపూర్, రెడ్డి ఫంక్షన్ హాల్ వెనుక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం

కరీంనగర్‌రూరల్, మే 21: మండలంలోని ఎలబోతారం గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా బ్రాంచ్ ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్స్ ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పెండ్యాల కేశవరెడ్డి, సెక్రెటరీ ఉట్కూరి రాధకృష్ణరెడ్డి, ట్రెజరర్ పోరెడ్డి శ్రీహరిరెడ్డి, మెడికల్ ఆఫీసరస్ డాక్టర్ ఎంఎల్ఎన్ రెడ్డి, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

నెలాఖరులోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్, మే 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి ఈనెల 31లోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ శాంతికుమారి కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఆమె కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో ధాన్యం కొనుగోళ్లపై టెలీ కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ రైతులకు త్వరగా డబ్బులు చెల్లించాలన్నారు. ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాలని, రైతులకు నష్టం జరుగకుండా చూడాలని తెలిపారు. వర్షంతో తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొని మిల్లులకు తరలించాలని ఆదేశించారు. మిల్లర్లతో రైతులకు ఇబ్బందులు లేకుండా కలెక్టర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలకు ధాన్యం తడువకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ రజనీకాంత్, ఇన్‌చార్జి డీఎస్‌వో సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీతోనే దేశంలో సాంకేతిక విప్లవం

- డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్ అర్బన్, మే 21: రాజీవ్ గాంధీతోనే దేశంలో సాంకేతిక విప్లవానికి పునాది పడిందని మానకొండూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్ గాంధీ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ భారతదేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని రాజీవ్‌గాంధీ పరితపించారన్నారు. దేశ సమగ్రత, ఐకమత్యం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం 18 సంవత్సరాలు వయస్సు దాటిన యువతకు ఓటు హక్కు కల్పించారని తెలిపారు. ఆయన చేసిన సేవలను దేశ ప్రజలు ఎన్నటికీ మరిచి పోరని, నేడు రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయ నను స్మరిం చుకుంటూ ఘన నివాళులు అర్పిస్తున్నామ న్నారు. అనంతరం టీపీసీసీ కార్యదర్శి వైద్యులు అంజన్‌కుమార్ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్‌చౌక్ వద్ద ఏర్పాటు చేసిన కార్య క్రమానికి కవ్వంపల్లి సత్యనారాయణతోపాటు నాయకులు హాజరై రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న రెడ్డి, నాయకులు పులి అంజనేయులు గౌడ్, శ్రావణ్ నాయక్, మడుపు మోహన్, సిరాజ్‌హుస్సేన్, ఆకారపు భాస్కర్ రెడ్డి, వెన్న రాజ మల్లయ్య, బొబ్బిలి విక్టర్, కల్వల రాంచందర్, ముస్తాక్ పాల్గొన్నారు.



రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మానకొండూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

భగత్‌నగర్, మే 21: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ బీజేపీ రణభేరి పేరిట జిల్లా కార్యాలయంలో బీజేపీ శ్రేణులు మంగళవారం నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు వ్యతిరేక ప్రభుత్వం రాజ్యమేలుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. తడిసిన ధాన్యాన్ని పూర్తి మద్ధతు ధరతో కొనుగోలు చేయాలన్నారు. తాలు, తరుగు, తేమ పేరిట రైతాంగాన్ని ఇబ్బంది పెట్టవద్దన్నారు. మేనిఫెస్టోలో కాంగ్రెస్‌పార్టీ ప్రకటించిన విధంగా క్వింటా లుకు 500 రూపాయలు బోనస్ చెల్లించాలని కోరారు. రెండు లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని, రైతు భరోసా కింద రైతులకు 15 వేలు, కౌలురైతులకు 12 వేలు అందించాలని డిమాండ్ చేశారు. కార్య క్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్, బాస సత్యనారాయణరావు, వాసాల రమేష్, రాజేంద్రప్రసాద్, గుంజేటి శివకుమార్, నరహరి లక్ష్మారెడ్డి, ఎడమ సత్యనారాయణరెడ్డి, దుర్శేటి సంపత్, దుర్శేడ్ అనూప్‌కుమార్, బండ రమణారెడ్డి, కొలిపాక శ్రీనివాస్, సుధాకర్ పటేల్, బండారి గాయత్రి, రాగి సత్యనారాయణ, జానపట్ల స్వామి, తిరుమల్ రెడ్డి, మాడిశెట్టి సంతోష్‌కుమార్, అడిచెర్ల రాజు పాల్గొన్నారు.



బీజేపీ జిల్లా కార్యాలయంలో దీక్ష చేస్తున్న బీజేపీ నాయకులు











విలీన ప్రక్రియ ముందుకు సాగేనా?

● దోలాయమానంలో ఆర్టీసీ ఉద్యోగులు ● ప్రభుత్వం స్పందించాలని వినతి

భగత్‌నగర్, మే 21: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసినా ప్రక్రియ మాత్రం ముందుకు సాగడం లేదు. 2019 సంవత్సరంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ ఉద్యోగులు విలీనం చేయాలని సమ్మె చేసినా ఆ దిశగా అడుగులు వేయని ప్రభుత్వం 2023 ఆగస్టు నెలలో ఒక్కసారిగా విలీన ప్రక్రియను ముందుకు తీసుకు వచ్చి మంత్రివర్గ సమావేశంలో చర్చించి బిల్లును ఏకగ్రీవ తీర్మానంతో ఆమోదించారు. విలీన బిల్లుకు సెప్టెంబరులో గవర్నర్ ఆమోదముద్ర వేయడంతో ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ తంతు ముగిసినా విధి విధానాల రూపకల్పనకు ఓ కమిటీని వేసింది. ఆ తర్వాత వచ్చిన ఎన్నికల కోడ్‌లతో విలీన ప్రక్రియకు బ్రేకులు పడ్డాయి. ఆర్టీసీ కార్మికుల సమ్మె కాలంలో కాంగ్రెస్ పార్టీ ఉద్యోగులకు మద్దతు ప్రకటించిన నేపథ్యంలో ఆర్టీసీ ఉద్యోగులు విలీన ప్రక్రియపై ఆశలు పెట్టుకున్నారు.



కరీంనగర్ రీజియన్‌లో 3,472 మంది ఉద్యోగులు

కరీంనగర్ రీజీయన్‌లో 11 ఆర్టీసీ డిపోలు ఉండగా 3472 మంది ఉద్యోగులు ఉన్నారు. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా కరీంనగర్-1, కరీంనగర్-2, గోదావరిఖని, జగిత్యాల, వేములవాడ, సిరిసిల్ల, మంథని, హుజూరాబాద్, హుస్నాబాద్, కోరుట్ల, మెట్‌పల్లి డిపోలు ఉన్నాయి. గోదావరిఖనిలో 524 మంది ఉద్యోగులు, హుస్నాబాద్‌లో 210, హుజూరాబాద్‌లో 253, కరీంనగర్-1 డిపోలో 423, కరీంనగర్-2లో 384, మంథనిలో 211, జగిత్యాలలో 435, కోరుట్లలో 226, మెట్‌పల్లిలో 231, సిరిసిల్లలో 266, వేములవాడలో 250 మంది ఉద్యోగులతో పాటుగా మిగతా 59 మంది కలుపుకుని 3472 మంది ఉద్యోగులు ఉన్నారు. ఆర్టీసీ విలీన ప్రక్రియ పూర్తయితే రీజియన్ వ్యాప్తంగా ఉన్న 11 డిపోల పరిధిలోని ఉద్యోగులందరికీ లాభం జరిగే అవకాశం ఉంది.

ఆందోళనలో రిటైర్డ్ ఉద్యోగులు

కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా ప్రభుత్వం విలీన ప్రక్రియ గెజిట్ పబ్లిష్ చేసిన తర్వాత అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు రిటైర్డ్ అయిన వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. విలీన ప్రక్రియ ముగిసిన తర్వాత తమకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా రావాల్సిన మొత్తాలను అందించాలని రిటైర్డ్ అయిన ఉద్యోగులు కోరుతున్నారు. గత సెప్టెంబర్ నెలలో 8 మంది, అక్టోబర్ నెలో 8 మంది, నవంబర్ నెలలో 8, డిసెంబర్ నెలలో 11 మంది, జనవరి నెలలో 15 మంది, ఫిబ్రవరి నెలలో 10, మార్చి నెలలో 13 మంది, ఏప్రిల్ నెలలో 20 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. గత సంవత్సరం విలీన ప్రక్రియ గెజిట్ విడుదల అయినప్పటి నుంచి ఇప్పటి వరకు 93 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల పరిస్థితిని అర్థం చేసుకుని ఆర్టీసీ విలీన ప్రక్రియను వేగవంతం చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.



జూలై 3 నుంచి ఎయిర్‌ఫోర్స్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

కరీంనగర్ స్పోర్ట్స్, మే 21: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అగ్నివీర్ వాయు (సంగీతకారుడు) రిక్రూట్‌మెంట్ ర్యాలీని జూలై 3 నుంచి 12 వరకు నిర్వహించనున్నారు. 3ఏఎస్‌సీ ఎయిర్‌ఫోర్స్ సంస్థ ఖాన్‌పూర్, 7ఏఎస్‌సీ, 1 కబ్బన్‌రోడ్, బెంగుళూరు కర్ణాటకలో నిర్వహించనున్న ఈ ర్యాలీలో పాల్గొనటానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి వై తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. పెళ్లి కాని భారతీయ పురుషులు, మహిళల కోసం అగ్నివీర్ వాయు కోసం రిజిస్ట్రేషన్ ఆధారిత రిక్రూట్‌మెంట్ ర్యాలీని నిర్వహిస్తుం దన్నారు. దీనికి సంబంధించి ఇంటెక్ 01/2025 రిక్రూట్‌మెంట్ కోసం జాబ్ నోటిఫికేషన్ జారీ అయిందన్నారు. అగ్నిపథ్ పథకం ప్రవేశంతో క్లరికల్/టెక్నికల్ క్యాడర్లలో ఉద్యోగావకాశాలు ఇపుడు నాలుగు సంవత్సరాల సర్వీసుకు పరిమితం చేయబడుతుందని, అభ్యర్థులలో 25శాతం మందికి శాశ్వత ప్రవేశం కల్పించ బడుతుందని పేర్కొన్నారు. అభ్యర్థి అవివాహితుడై, 2జనవరి, 2004 నుంచి 2 జూలై 2007 మధ్య జన్మించి ఉండాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల/బోర్డు నుంచి కనీస పాస్ మార్కులతో పదవ తరగతి ఉత్తీర్ణత/సమాన విద్య కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు టెంపో, పిచ్, ఒక పూర్తి పాట పాడడంలో కచ్చితత్వంతో సంగీతంలో ప్రావీణ్యం కలిగి ఉండాలని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 22 ఉదయం 11 గంటల నుంచి జూన్ 5 వరకు రాత్రి 11 గంటల వరకు వెబ్‌పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

జగిత్యాల టౌన్, మే 21:జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఎల్లాల గోపాల్ రెడ్డి తన సెల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా గోపాల్ రెడ్డి అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ట్రేస్ చేసి రికవరి చేశారు. మంగళవారం బాధితుడికి సీఐ వేణు గోపాల్ చేతుల మీదుగా అందజేశారు. టౌన్ ఎస్సై నరేష్, మన్మధరావు ఉన్నారు.



విద్యుత్ స్తంభాలకు ఢీకొన్న ఇసుక ట్రాక్టర్

సిరిసిల్ల క్రైం, మే 21: సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌లో మంగళవారం ఉదయం ఇసుక ట్రాక్టర్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాలను ఢీకొంది. మానేరువాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సాయినగర్ రోడ్డుపై వెళ్తోంది. అజాగ్రత్తతో అతివేగంగా డ్రైవింగ్ చేయడంతో అదుపుతప్పి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో మూడు స్తంభాలు విరిగి కిందపడ్డాయి. తీగలు తెగిపోయాయి. దీంతో ఆ కాలనీలోని పలు ఇళ్లల్లో టీవీలు, రిఫ్రిజిరేటర్‌లు ఒక్కసారిగా కాలిపోయాయి. ఏం జరిగిందోనని ప్రజలు ఆందోళన చెందారు. ప్రమాదం జరిగిన కొంత సేపటికే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌లన్నీ సాయినగర్ కాలనీలో నిలిచిపోవడంతో ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. ప్రతీ రోజు ఇసుక రవాణాతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన చేశారు. ఈ సంఘటన తెలుసుకున్న సెస్ అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరణలో నిమగ్నమయ్యారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట, మే 21: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ శివారులోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామని ఎస్ఐ రమాకాంత్ మంగళవారం తెలిపారు. నారాయణపూర్ గ్రామ సమీపంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రావు తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఆపారని పేర్కొన్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేశామని చెప్పారు. నారాయణపూర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పోదరి రాకేశ్, వాహన యజమాని గోగూరి ప్రభాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేశామన్నారు. అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.





భక్తులతో కిక్కిరిసిన కొండగట్టు



ఆలయం ఎదుట భక్తులు

మల్యాల, మే 21: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. వేసవి సెలవుల నేపథ్యంలో సోమవారం రాత్రికే వేలాదిగా కొండపైకి చేరుకున్న భక్తులు వేకువజాము నుంచే స్వామి వారిని దర్శించుకోడానికి బారులు తీరారు. అంజన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకోగా ఆలయంలో అభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఏఈవో అంజయ్య ఇతర అధికారులు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది. కాగ కొండ పైన అలిశెట్టి విష్ణు అనే భక్తుడు సెల్‌ఫోన్, నగదుతో కూడిన బ్యాగ్ పోగొట్టుకోగా ఏఎస్సై చిలుక శ్రీనివాస్ సిబ్బందితో వెతికి భక్తుడికి అప్పగించారు.

రూ. 7,400 పలికిన పత్తి ధర



జమ్మికుంట రూరల్, మే 21: జమ్మి కుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,400 రూపాయలు పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 22 మంది రైతులు 270క్వింటాళ్ల విడి పత్తి, ఐదుగురు రైతులు ఏడు క్వింటాళ్లు గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర 7,400, కనిష్ఠ ధర ఐదు వేలు చెల్లించి కొన్నారు.

వివాహిత హత్య



మమత (ఫైల్)

మెట్‌పల్లి, మే, 21 : మెట్‌పల్లి పట్టణానికి చెందిన సంగం మమత(38)అనే మహిళ మంగళవారం హత్యకు గురైంది. ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం..పట్టణానికి చెందిన సంగం మమత కొంత కాలంగా అబ్దుల్ అప్సర్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం నడిపిస్తోంది. మమత తన భర్తతో నాలుగేళ్ల క్రితం విడాకులు తీసుకుని కొడుకు, కూతురుతో కలిసి పట్టణంలోని వేరుగా ఉంటోంది. అప్సర్ తరుచుగా మమత ఇంటికి వస్తూ ఉండే వాడు. సోమవారం రాత్రి మమత, అప్సర్‌ల మధ్య గొడవ జరిగింది. అప్సర్ కోపంతో మమ తను గొంతు నులిమి, కత్తితో పొట్టలో పొడవడంతో తీవ్ర రక్తస్రావంతో పడిపోయిం ది. గమనించిన కూతురు 108లో ప్రభుత్వ ఆసపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు, సీఐ నవీన్, ఎస్సై చిరంజీవి సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలను సేకరించారు. మమత కూమారుడు సంగం గ్రహిత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గోదావరిలో గుర్తు తెలియని మృతదేహం



ధర్మపురి, మే 21: ధర్మపురి మండలంలోని రాయపట్నం నది బ్రిడ్జి కింద గోదావరి నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. మృతుడు సుమారు 45 ఏళ్ల వయస్సు కలిగి ఉన్నాడని ఆయన పేర్కొన్నారు. మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో గల మార్చురీ గదిలో భద్రపరిచినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ధర్మపురి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

శంకరపట్నం, మే 21: మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన బొంతల హన్మంతు (70) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపల్లి గ్రామానికి చెందిన బొంతల హన్మంతుకు అతని తమ్ముడు బొంతల సమ్మయ్యతో భూవివాదం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. సమ్మయ్య హన్మంతును, అతని కుటుంబ సభ్యులను తిడుతూ చంపుతానని బెదిరించాడు. దీంతో హన్మంతు మనస్తాపానికి గురై ఈ నెల 18న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. పరిస్థితి విషమించి సోమవారం అర్ధరాత్రి చికిత్స పొందతూ మృతి చెందాడు. మంగళవారం హన్మంతు కుమారుడు బొంతల రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు.

రెండు ఇసుక లారీల పట్టివేత

జమ్మికుంట రూరల్, మే 21: మండలంలోని విలాసాగర్ సమీపంలోని మానేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. నాగంపేట గ్రామం వద్ద హెడ్ కానిస్టేబుల్ భాస్కర్‌రెడ్డి, పెట్రోలింగ్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తుండగా విలాసాగర్ మానేరు నుంచి వస్తున్న రెండు ఇసుక లారీలను స్వాధీనం చేసుకోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. లారీల యాజమానులు వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చందుపట్ల జితేందర్‌రెడ్డి, వేములవాడకు చెందిన ముద్రకోల మహేష్, డ్రైవర్లు జాన ప్రశాంత్, ఎరుకల అంజయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీ

రుద్రంగి మే 21: మద్యం మత్తులో లారీ డ్రైవర్ బీభత్సాన్ని సృష్టించిన సంఘటన రుద్రంగి మండల కేంద్రంలో బస్టాండ్ ప్రాంతంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగి మండలం మానాల గ్రామంలోని కొనుగోలు కేంద్రానికి వెళ్తున్న క్రమంలో లారీ డ్రైవర్ మద్యం మత్తులో బస్టాండ్ ప్రాంతంలోని డివైడరును ఢీకొని డివైడర్ పైకి దూసుకెళ్లాడు. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగలేదు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ సిరిసిల్ల అశోక్ పరిశీలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

అదుపు తప్పి వ్యాన్ బోల్తా

మానకొండూరు, మే 21: మండలంలోని అన్నారంలో మంగళవారం ఓ వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. వివరాలు ఇలా ఉన్నాయి కరీంనగర్ నుం చి మండలంలోని అన్నారం గ్రామానికి వరివిత్తనాలతో వ్యాన్ బయలు దేరింది. అన్నారం గ్రామంలోని మూల మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాలకుర్తి, మే 21: పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం పరిధిలోని వేంనూర్ గ్రామంలో సోమవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో గాయపడిన దీకొండ మహేందర్ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపారు. మహేందర్ కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రాగంపేట గ్రామానికి చెందిన వ్యక్తి అని ఎస్ఐ తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో ఇద్దరికి గాయాలు

మల్లాపూర్, మే, 21 : మండలంలోని ముత్యంపేట గ్రామంలోని వాకిటి గంగవ్వ, మారు రాజశ్రీల ఇళ్లల్లోకి పిచ్చికుక్క చొరబడి దాడి చేసిన ఘటనలో మంగళవారం ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితులు తెలిపి న వివరాల ప్రకారం..గ్రామంలో మధ్యాహ్నం వాకిటి గంగవ్వ అను వృద్ధురాలు ఇంట్లో నిద్రిస్తోంది. అదే సమయంలో పిచ్చికుక్క ఇంట్లోకి చొరబడి గంగవ్వ ముఖంపై, ఎదురింట్లో ఉన్న మారు రాజశ్రీ కాళ్లను కొరికి తీవ్రంగా గాయపరిచింది. గమనించిన స్థానికులు, కుంటుంబ సభ్యులు మెట్‌పల్లిలోని వారిని ఆసపత్రికి తరలించారు. గ్రామంలో పిచ్చికుక్కల బెడద నుంచి రక్షణ కల్పించాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు.

వైభవంగా నరసింహ జయంత్యుత్సవాలు

ముగిసిన నవరాత్రోత్సవాలు



నరసింహ స్వామివారు

ధర్మపురి, మే 21: ధర్మపురి క్షేత్రంలో శ్రీ నరసింహ జయంతి ఉత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ నెల 13 నుంచి ప్రారం భమైన నరసింహ నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, సామవేద పండితులు ముత్యాల శర్మ మంత్రోచ్చారణల మధ్య ఆలయ ముఖ్య అర్చ కులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు స్వామి వారలకు పురుష సూక్త, శ్రీసూక్త, కల్పోక్త, న్యాసక పూర్వక, శోడషోపచార పూజ నిర్వహించారు. పంచోపనిషత్తులతో మన్యసూక్తం, నున్నాల వన్నము, రుద్రంతో అభిషేక పూజలు, విశేష పూజ లు, పంచోపనిషత్తులో అభిషేకం, సహస్ర నామా ర్చన, హారతి, వేద మంత్ర పుష్పం, చతుర్వేద అవధార్యాలు, ప్రత్యేక పూజలు, సప్త హారతులు నిర్వహించారు.

సాయంత్రం వేళలో స్తంబోధ్భవ కాలంలో విశేష పూజలు, భజనా కార్యక్రమాలు నిర్వహించారు. నృసింహ జయంతి సందర్భంగా రాజగోపురాల కు, శ్రీ స్వామి వారలకు, దేవాల యాల కు ప్రత్యేక పూల అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం ప్రతి నిత్యం మూడు వాటర్ కూలర్స్‌తో పాటు అదనంగా మరో రెండు చోట్ల లడ్డూ కౌంటర్ ముందు, దేవాలయం ఎదుట చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు గోదావరిలో స్నానాలు చేసిన అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారలను దర్శిం చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిం టెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఆలయ వేదపండి తులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ అడ్లూరి

ధర్మపురి క్షేత్రంలో నరసింహ జయంతి వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపి, దర్శనం చేసుకున్నారు. ఆలయ వేద పండితులు, అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించి, స్వామి తీర్థ, ప్రసాదాలు అందించారు.







స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు, స్వామి వారలకు హారతి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, స్వామి వారిని దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

క్రీడాకారులు ఐపీఎల్ స్థాయికి ఎదగాలి

కేడీసీఏ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు



క్రీడాకారుడికి ప్రశంసాపత్రం అందజేస్తున్న మురళీధర్ రావు

కరీంనగర్ సోర్ట్స్, మే 21: జిల్లా క్రీడాకారులు క్రికెట్ శిక్షణ శిబిరాలలో నేర్చుకున్న మెళ కువలతో ముున్ముందు ఐపీఎల్ స్థాయికి ఎదగాలని కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్ మురళీధర్ రావు అన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలలో నిర్వహించిన ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు మంగళవారం ఉదయం ముగిశాయి. జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ కళాశాల ఎదురుగా గల కేడీసీఏ ప్రధాన మైదానంలో గత నెల 20వ తేదీ నుంచి ప్రారంభమైన ఉచిత వేసవి శిక్షణ శిబిరం సోమ వారం ఉదయం ముగిసింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలను, శిక్షణ శిబిరాలు నిర్వ హిం చిన కోచ్‌లకు మెమెంటోను ప్రదానం చేసి మాట్లాడారు. క్రీడా కారులు క్రమ శిక్షణకు మారు పేరుగా నిలవాలన్నారు. నెల రోజులుగా నిర్వహించిన శిక్షణ శిబిరంలో పాల్గొన్న అండర్ 14,16,19,23, వయసు విభాగాల బాల బాలికలకు ప్రశం సాపత్రాలను అందించారు.

మైతాపూర్ బ్రిడ్జి వద్ద ధాన్యం లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

రాయికల్, మే 21: మండలంలోని మైతాపూర్ బ్రిడ్జి వద్ద ధాన్యం తరలిస్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. రాయికల్ నుంచి కోరుట్లకు ధాన్యం తీసుకువెళ్తున్న లారీ మైతాపూర్ బ్రిడ్జిపైకి రాగానే బోల్తా పడింది. మైతాపూర్ బ్రిడ్జిపై ఇటీవల కాంట్రాక్టర్ మట్టి పోయడంతో మట్టిలో దిగబడి లారీ బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. కాగా విషయాన్ని తెలుసుకున్న కౌన్సిలర్లు తురగ శ్రీధర్, వల్లకొండ మహేష్ గౌడ్, రైతులు బోల్తా పడిన లారీని, ధాన్యం బస్తాలను పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణం నత్తనడకన సాగుతుందని, అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందన్నారు. బ్రిడ్జి పనులు నడుస్తున్నాయని హెచ్చరిక బోర్డులు కూడా లేకపోవడం బాధాకరమన్నారు. అలాగే పనులు నడుస్తున్నప్పుడు వాహనాలు వెళ్లడానికి కనీసం మట్టి రోడ్డు నిర్మాణం చేయలేదన్నారు. ఎక్కువ గుంతలు ఉండటంతో ఈ ప్రమాదం జరిగినట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు, కాంట్రాక్టర్లు మట్టి రోడ్డు నిర్మాణం చేయించి, బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని కోరుతున్నారు.

వడదెబ్బతో కౌలు రైతు మృతి



సుల్తానాబాద్, మే 21 : పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని బొంతకుంటపల్లి గ్రామానికి చెందిన పోలాడి నర్సింగరావు (70) అనే రైతు వడదెబ్బతో మృతిచెందాడు. తాను కౌలుకు తీసుకున్న 2 ఎకరాల్లో సోమవారం పెసర్లు అలికి ఇంటికి రాగా, ఎండ తీవ్రతకు అస్వస్థత గురయ్యాడు. మంగళవారం ఆసుపత్రికి వెళ్లి ఇంటికి రాగా సాయంత్రం మృతిచెందాడు. మృతుడి భార్య గతంలో మృతిచెందగా, పిల్లలు లేరు.

ఠాణా ఎదుట ఎస్సై భార్య ఆందోళన

- రెండో పెళ్లి చేసుకొని.. తమకు అన్యాయం చేస్తున్నాడని ఆవేదన





కుటుంబ సభ్యులతో ఆందోళన చేస్తున్న మానస, మానస, పిల్లలతో ఎస్ఐ నాగరాజు (ఫైల్)

చేర్యాల, మే 21 : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి ఎస్సై నాగరాజు తనకు తెలియకుండా రెండో వివాహం చేసుకున్నాడని, పిల్లలను బలవంతంగా తీసుకెళ్లాడని అతడి మొదటి భార్య మానస మంగళవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్ ఎదుట తల్లి, బంధువులతో కలిసి ఆందోళనకు దిగింది. నాగరాజు రెండో భార్య వల్ల తనకు, తన పిల్లలకు ప్రాణహాని ఉందని, పోలీసులు తనకు న్యాయం చేయాలని కోరుతోంది.

కరీంనగర్ జిల్లా గోపాల్ పూర్‌కు చెందిన మానసకు కొమురవెల్లి ఎస్సై నాగరాజుతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సుమారు రెండేళ్ల క్రితం ఎస్సై నాగరాజు మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని మానసను వేధిస్తున్నాడు. కొంతకాలం క్రితం మానసను, పిల్లలను కరీంనగర్‌లో ఉంచాడు. అప్పుడప్పుడు అక్కడికి వచ్చి పోయేవాడు. వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళను రెండో పెళ్లి చేసుకున్నాడు. రెండు నెలల క్రితం బలవంతంగా పిల్లలను తీసుకెళ్లి.. వాళ్లు ఎక్కడున్నారో మానసకు చెప్పకుండా విడాకులు ఇవ్వాలని వేధిస్తున్నాడు. దీంతో మానస ఆత్మహత్యాయత్నం చేసుకుంటానని ఆమె సూసైడ్ నోట్ రాసి పెట్టుకోగా గమనించిన కుటుంబ సభ్యులు కలుగ జేసుకుని న్యాయం చేస్తామని చెప్పడంతో విరమించుకుంది. తన భర్త విషయాన్ని సిద్దిపేట సీపీ, చేర్యాల సీఐ, కరీంనగర్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని బాధితురాలు వాపోతోంది. తనకు, తన ఇద్దరు పిల్లలకు ఎస్సై నాగరాజు రెండో భార్యతో ప్రాణహాని ఉందని, నాగరాజు, పిల్లలు తనతో కలిసి ఉండేలా న్యాయం చేయాలని ఆమె మంగళవారం కొమురవెల్లి పోలీస్ స్టేషన్ ముందు ఆందోళనకు దిగింది. అయితే, ఎస్సై నాగరాజు సెలవులో ఉన్నారని సిబ్బంది చెప్పారు. తనకు న్యాయం జరిగేంత వరకు ఆందోళన విరమించనని అక్కడే కూర్చుంది. ఈ విషయమై సీఐ శ్రీనును సంప్రదించగా, విషయాన్ని మానస ఇటీవల తన దృష్టికి తీసుకువచ్చారని.. కౌన్సెలింగ్ చేశామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఎస్‌యూ ఇన్‌చార్జి వీసీగా సురేంద్రమోహన్



గణేశ్‌నగర్, మే 21: శాతవాహన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా సురేంద్రమోహన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న వీసీ పదవీ కాలం పూర్తి కావడంతో ఐఏఎస్ అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించింది. కొత్త వీసీలు నియమితులు అయ్యే వరకు వీరు విధుల్లో కొనసాగనున్నారు. ఇప్పటికే కొత్త వీసీల కోసం యూనివర్సిటీలో సెర్చ్ కమిటీ ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మూడేళ్ల చిన్నారి మృతి

జగిత్యాల టౌన్, మే 21: జిల్లా కేంద్రంలోని 10వ వార్డులోని లింగంపేట శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడేళ్ల చిన్నారి మృతి చెందింది. మల్యాల మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన నిమ్మని శిరీష తన కూతురు విన్మయి(3)తో కలిసి లింగంపేటలో ఎల్లమ్మ పట్నాల కార్యక్రమానికి హాజరైంది. తిరిగి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం శిరీష నడుపుతున్న వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో వాహనంపై ఉన్న చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. హుటా హుటిన జగిత్యాలలోని ఆసుపత్రికి తరలించగా మృతి చెందింది. తల్లి శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పాలకుర్తిలో వ్యక్తి..

పాలకుర్తి, మే 21: మండల పరిధిలోని ఎయిర్‌పోర్టు సమీపంలో మంగళవారం జరిగిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో జయ్యారం గ్రామానికి చెందిన జంగ శంకర్(40) మృతిచెందాడు. ధర్మారం ఎక్స్‌రోడ్డు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా కొత్తపల్లి గ్రామం నుంచి ఎక్స్‌రోడ్డుకు వెళ్తున్న పోతు నరేష్ ద్విచక్రవాహనంపై వచ్చి బలంగా ఢీకొట్టడంతో శంకర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతునికి భార్య శిరీష, కూతూరు వైష్ణవి, కుమారుడు చర్రి ఉన్నారు.

బావిలో పడి గొర్రెల కాపరి మృతి

సుల్తానాబాద్, మే 21 : మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన వేల్పుల అంజయ్య(55) అనే గొర్రెల కాపరి ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతిచెందాడు. రోజువారిగా మంగళవారం కూడ అంజయ్య గొర్రెలను మేతకు తీసుకెళ్లాడు. వ్యవసాయ బావి దగ్గర గొర్రెలు మేస్తుండగా పక్కనే ఉండి గమనిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జారి బావిలో పడి మృతిచెందాడు. అంజయ్యకు భార్య కేతమ్మతో పాటు కుమారుడు ఉన్నాడు. కేతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

చొప్పదండి, మే21: చొప్పదండి మండంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన బైరగోని ఆనందం(45) ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఉపేంద్రచారి కథనం మేరకు బైరగోని ఆనందం రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఆరునెలలుగా వ్యాపారం నడవకపోవడంతో నష్టాలపాలై జీవితంపై విరక్తి చెంది మంగళవారం తెల్లవారు జామున ఇంటిముందు బాల్కని ఇనుప చువ్వకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నష్టాలు వచ్చి తరచు బాదపడుతుండే వాడని, ఆనందం భార్య రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

వేములవాడ రూరల్, మే 21: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు రూరల్ ఎస్సై మారుతి తెలిపారు. ఎదురుగట్ల గ్రామంలో అదే గ్రామానికి చెందిన పస్తం శ్రీనివాస్ ఆటోలో అక్రమంగా 13 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తర లిస్తుండగా మంగళవారం రూరల్ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తే చర్యలుంటాయని ఎస్సై హెచ్చరించారు.

రాయికల్‌లో భారీ చోరీ

సుమారు 40 తులాల బంగారం, రూ.లక్ష అపహరణ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, పోలీసులు

రాయికల్, మే 21: రాయికల్ పట్టణంలో మంగళవారం రాత్రి భారీ చోరీ జరిగింది. పట్టణానికి చెందిన బుడిక విజయలక్ష్మి ఇంట్లో గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి భారీ చోరీకి పాల్పడ్డారు. మంగళవారం సాయంత్రం బంధువుల ఇంటి నుంచి తన ఇంటికి చేరుకున్న విజయలక్ష్మికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండ టంతో అనుమానంతో ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇచ్చి ఇంట్లోకి వెళ్లింది. ఇంట్లో బీరువా పగులగొట్టి ఉండగా, అందులో ఉన్న సుమారు 40 తులాల బంగారం, రూ.లక్ష నగదు మాయం కావడంతో చోరీ జరిగినట్లు గ్రహించింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయ డంతో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్, ఎస్సై అజయ్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరుపుతున్నారు. బాధితుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సంఘటనపై డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ వివరాలు సేకరిస్తున్నారు.

ఎస్‌యూ వీసీకి ఘనంగా వీడ్కోలు



వీసీ మల్లేష్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సిబ్బంది

గణేశ్‌నగర్, మే 21: శాతవాహన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్, ప్రొఫెసర్ సంకషాల మల్లేష్ పదవీకాలం మంగళవారం ముగియడంతో వివిధ కళాశాల బాధ్యులు, సిబ్బంది, శాలువాతో ఘనంగా సత్కరించారు. వీసీని సన్మానించిన వారిలో శ్రీ చైతన్య డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాస్‌తో పాటు వివిధ డిగ్రీ కళాశాలల బాధ్యులు, శాతవాహన యూనివర్సిటీ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భగవతి, అర్విన్‌ట్రీ స్కూల్‌లో ముగిసిన సమ్మర్ క్యాంప్



ముగింపు వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

కరీంనగర్ టౌన్, మే 21: నగరంలోని భగవతి, అర్విన్ ట్రీ స్కూల్‌లో నెల రోజులుగా నిర్వహిస్తున్న సమ్మర్ డ్యాన్స్ క్యాంపు-24 ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం పాఠశాల చైర్మన్ బి.రమణారావు, కరస్పాండెంట్ బి.విజయలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి ముగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో నెలరోజులుగా సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులకు క్లాసికల్, వెస్ట్రన్, హిప్-హాప్, జుంటా డాన్స్ పలు రాష్ట్రాల జానపద నృత్యాలు ఈ శిబిరంలో ఉచితంగా శిక్షణ ఇచ్చారు. డ్యాన్స్ మాస్టర్స్ గోవింద్, గురు చాలా నిబద్ధతతో చక్కని నృత్యరీతులను, మెళకువలను నేర్పించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ డ్యాన్స్ అనేది మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తూ, శారీరక ధృడత్వాన్ని పెంపొందిస్తుందని అన్నారు. కరస్పాండెంట్ విజయలక్ష్మి మాట్లాడుతూ డాన్స్ పట్ల పిల్లలకు గల ఆకర్షణను గుర్తించి నిర్వహించిన ఈ సమ్మర్ క్యాంపు విజయవంతం కావడం ఆనందంగా ఉందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి.

'రాజకీయాలకు అతీతంగా వీసీ పోస్టులను భర్తీ చేయాలి'

గణేశ్‌నగర్, మే21: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల్లో వీసీ పోస్టులను రాజకీయాలతో సంబంధం లేని వ్యక్తులతో భర్తీ చేయాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ యూఎస్‌ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వంగూరి వెంకటేశ్వర్లు, మాదం తిరుపతి ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పుడు నిర్ణయాల వల్ల గత ప్రభుత్వానికి అనువుగా ఉన్న వ్యక్తులకే వీసీ పోస్టులను కట్టబెట్టి యూనివర్సిటీలను భ్రష్టు పట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే గత ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా నియమించిన యూనివర్సిటీల వైస్ ఛాన్స్‌లర్, రిజిస్ట్రార్లపై కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

గత ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేసిన వారికి వీసీ, రిజిస్ట్రార్‌గా నియమించారని దీనివల్ల వారు గత ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరించి యూనివర్సిటీలను భ్రష్టు పట్టించాలని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకొని విద్యార్థులను చదువుకు దూరం చేసే కుట్ర చేశారని తెలిపారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన డిటెన్షన్, దోస్త్ విధానంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. వీసీ, రిజిస్ట్రార్ ఆస్తులపై కూడా విచారణ జరపాలని కోరారు. గత ప్రభుత్వ అండదండలతో వీసీ, రిజిస్ట్రార్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అనేక మంది విద్యార్థులను ఇబ్బందులకు గురి చేసారని ఆరోపించారు. గత ప్రభుత్వం లాగా ప్రొఫెసర్‌గా 10 సంవత్సరాల అనుభవం లేని వారిని ఇంటర్నేషనల్ రీసర్చ్ చేయని వారిని వీసీలుగా నియమించడం వలన ఇబ్బందులు కలుగుతాయన్నారు. ప్రభుత్వం అలాంటి తప్పిదాలు చేయకుండా ప్రస్తుతం అనుభవజ్ఞులైన వారిని తీసుకొని నియమించాలని కోరారు. కాకతీయ యూనివర్సిటీ ,శాతవాహన యూనివర్సిటీ, తెలంగాణ యూనివర్సిటీలో ఉన్నటువంటి అధికారులు తమకు నచ్చిన విధంగా వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. విద్యాభివృద్ధి కోసం యూనివర్సిటీల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మాలధారణతో చెడు వ్యసనాలు దూరం

జమ్మికుంట, మే 21: హనుమాన్ మాలధారణతో చెడు వ్యసనాలు దూరమవుతాయని అర్చకుడుసముద్రాల ప్రసాద చార్యులు అన్నారు. మంగళవారం పట్టణంలోని మారుతినగర్‌లో గల పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ఏకాదశ దివస మాల ధారణ కార్యక్రమం నిర్వహించారు. మూడు వందల మంది స్వాములు హనుమాన్ మాల స్వీకరించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మామిడి అయిలన్న, రాజేందర్, మహేందర్, లక్ష్మణ్, సంపత్ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన

వీణవంక, మే 21: వీణవంక మండలం గొల్లపల్లి, మామిడాలపల్లి, ఇప్పలపల్లి, వీణవంకలోని అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు మంగళవారం పరిశీలించారు. పాఠశాలల్లో చేపడుతున్న విద్యుత్, టాయిలెట్ల మరమ్మతులు, నీటి వసతి, ఇతర పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గడువు లోపల అన్ని పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్, మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు సంపత్ కుమారచారి, పులి అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు విజయపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, ఏఈ రమేష్, వీవో సునిత, సీఆర్పీలు శ్రీనివాస్, సంపత్, కొమురయ్య, నారాయణ పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల విద్యా వ్యాపారాన్ని అరికట్టాలి

హుజూరాబాద్, మే 21: రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్య వ్యాపారం చేస్తూ ఫీజుల పేరుతో లక్షలాది రూపాయలు దోచుకుంటున్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్ విమర్శించారు. మంగళవారం హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రైవేట్ విద్యాసంస్థలు చేస్తున్న ఫీజుల దోపిడీ అరికట్టే విధంగా చర్యలు తీసుకుని ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలన్నారు. ఎన్నికల హామీలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే అమలు చేయాలన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలు చేస్తున్న ఫీజుల దోపిడి అరికట్టే విధంగా ఫ్రీజర్ నియంతను చట్టాన్ని కఠినంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలు పాటించని విద్యాసంస్థలను సీజ్ చేయాలని, లేకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారుల కార్యాలయాలు ముట్టడిస్తాని హెచ్చరిచారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి



ఫీడర్లను పరిశీలిస్తున్న నోడల్ అధికారి రాజు చౌహాన్

శంకరపట్నం, మే 21: వినియోగదారులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించాలని ఎన్పీడీసీఎల్ సీజీఎం, జిల్లా నోడల్ అధికారి రాజు చౌహాన్ అన్నారు. సోమవారం మండలంలోని ముత్తారం, వంకాయగూడెం గ్రామాల్లో 11కేవీ ఫీడర్లను ఆయన తనిఖీ చేశారు. అనంతరం తాడికల్, ఆముదాలపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని సిబ్బందితో సైదాపూర్ ఎక్స్ రోడ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 33కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మత్తులు వర్షాకాలంలోగా పూర్తి చేయాలన్నారు. విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్టు కొమ్మలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో గంగాధర్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, ఏఈలు సంపత్‌రెడ్డి, కుమారస్వామి, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

కరీంనగర్ అర్బన్, మే 21 : భారత రత్న, భారత దేశ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని న్యూయార్క్‌లోని టైమ్స్ స్క్వేర్ వద్ద రాజీవ్ గాంధీకి మంగళవారం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళులర్పించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ భారతదేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకుపోవడానికి ఆనాడు చేపట్టిన కార్యాచరణలో భాగంగానే ఈరోజు భారతదేశం సాంకేతిక రంగంలో విప్లవాత్మకమైన మార్పులు సాధించడానికి కారణమైందన్నారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ స్వరాజ్యం తేవడానికి కూడా నేరుగా ఢిల్లీ నుండి పల్లె వరకు నిధులను తీసుకురావడానికి కార్యాచరణను తీసుకున్నటువంటి గొప్ప వ్యక్తి రాజీవ్‌గాంధీగా పేర్కొన్నారు. పల్లెలు బాగుండాలని ఆశించిన వ్యక్తి రాజీవ్ గాంధీ అని, అటువంటి వ్యక్తికి నివాళులు అర్పించడం మన బాధ్యత అని అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా శాంతిని కాపాడడానికి కాంగ్రెస్ కార్యకర్తలుగా బాధ్యత తీసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ వర్ధంతిని ఉగ్రవాద వ్యతిరేక దినంగా పాటించాలని, ఆయన అడుగుజాడల్లో నడుస్తామని పిలుపునిచ్చారు.

●మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని నగర కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ సాంకేతిక విప్లవానికి మూలం రాజీవ్ గాంధీ అని, యువతకు పద్దెనిమిది సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించిన ఘనత కూడా రాజీవ్ గాంధీదే అని కొనియాడారు.





న్యూయార్క్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, హుజూరాబాద్‌లో..

దేశం కోసం ప్రాణాలర్పించిన రాజీవ్ గాంధీ ఆశయ సాధన కోసం కంకణ బద్దులమై పని చేస్తామని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రవణ్ నాయక్, అబ్దుల్ రహమాన్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, దండి రవీందర్, లయీక్, అస్తపురం రమేష్, ఎండి చాంద్, షేక్ ఫహేన్‌షా, విద్యాసాగర్, పొరండ్ల రమేష్, మిరాజ్, షబానా మహమ్మద్, ఊరడి లత, ముల్కల కవిత, జ్యోతిరెడ్డి, అస్తపురం తిరుమల, మామిడి సత్యనారాయణరెడ్డి, కొట్టే ప్రభాకర్, కిరణ్ రెడ్డి, సతీష్ రావు, శిరీష్, మాసూమ్‌ఖాన్, సుదర్శన్, కీర్తికుమార్ తదితరులు పాల్గొన్నారు.

●హుజూరాబాద్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొల్లూరి కిరణ్, సొల్లు బాబు, యేముల పుష్పలత, లావణ్య, మిడిదొడ్డి రాజు, సుశీల, కాజీపేట శ్రీనివాస్, మేకల తిరుపతి పాల్గొన్నారు.

● శంకరపట్నం: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య ఆధ్వర్యంలో మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

●సైదాపూర్: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

●జమ్మికుంట రూరల్: పట్టణంలోని గాంధీ చౌరస్తాలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడలో జరిగిన రాజీవ్‌గాంధీ వర్ధంతిలో జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

● ఇల్లందకుంట: మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని వంగ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు.

● వీణవంక: మండల కేంద్రంలో మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గంగాడి రాజిరెడ్డి, ఎండీ సాహెబ్ హుస్సేన్, మాజీ సర్పంచ్‌లు గంగాడి తిరుపతిరెడ్డి, ఎక్కటి రఘుపాల్‌రెడ్డి, చిన్నాల అయిలయ్య పాల్గొన్నారు.

నేడు వేదభవనంలో నమ్మాళ్వారుల తిరునక్షత్రం

కరీంనగర్ కల్చరల్, మే 21: నగర శివారులోని వేదభవనంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి 12 మంది ఆళ్వారులలో ఒకరైన నమ్మాళ్వార్ తిరునక్షత్రం (జయంతి) నిర్వహిస్తున్నట్లు వికాసతరంగిణి జిల్లా అధ్యక్షుడు కె గౌతమరావు ఒక ప్రకటనలో తెలిపారు. సేవాకాలం, కోయిల్ తిరువాయిమొజి పారాయణం, నమ్మాళ్వారులకు అభిషేకం, పెద్దల ద్వారా నమ్మాళ్వారుల వాగ్వైభవం తదితర కార్యక్రమాలుంటాయని పేర్కొన్నారు.

రేపు ఎన్నీల ముచ్చట్లు

కరీంనగర్ కల్చరల్, మే 21: తెలంగాణా రచయితల వేదిక ఆధ్వర్యంలో గురువారం రేకుర్తి లయోలా, ప్యారడైజ్ విద్యాసంస్థల ప్రాంతంలోని పుష్పవల్లి పంక్షన్‌హాల్ ఎదురు వీధిలోని వేంకటేశ్వరనగర్ ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల హిందీ విభాగ సహాయాచార్యుడు వాసాల వర ప్రసాద్ ఇంటి మిద్దెపై 133వ ఎన్నీల ముచ్చట్లు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సీవి కుమార్, శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

ఇన్‌కంట్యాక్స్‌పై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఎస్‌ఈ గంగాధర్

గణేశ్‌నగర్, మే21: విద్యుత్ సిబ్బందికి ఇన్‌కంట్యాక్స్‌పై అవగాహన సదస్సును మంగళ వారం నిర్వహించారు. కరీంనగర్ సర్కిల్ సమావేశ మందిరంలో ఇన్‌కంట్యాక్స్ డిపార్ట్‌మెంట్ వారిచే ట్యాక్స్ చేసే విధానము, ఫైలింగ్, ఫామ్16 అప్డేట్ ,రిటర్న్స్, ప్రాసెసింగ్ లెటర్, ఇంటిమేషన్, నోటీసులు తదితర అంశాలపై ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఇన్ కంట్యాక్స్ డిపార్ట్ మెంట్ కమిషనర్లు డాక్టర్ ఎన్.రాజకుమార్, ఐఆర్ఎస్ అడిషనల్ కమిషనర్ ఆఫ్ కరీంనగర్, ఈ కిరణ్ కుమార్, టిఆర్ఎస్, అసిస్టెంట్ కమిషనర్ సర్కిల్ కరీంనగర్,ఎచ్.లన్ ఇన్కమ్ టాక్స్ ఆఫీసర్ వార్డ్ కరీంనగర్, శ్రీకాంత్, రాజేశం ,డిఈ లు విజయేందర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, రాజం ,తిరుపతి, గోపికృష్ణ, కాళిదాసు, చంద్రమౌళి, ఎడీలు, ఎఏఓలు ఏడీలు, ఏఈలు పాల్గొన్నారు.

'జిల్లాల ఏర్పాటుపై కమిషన్ ఏర్పాటు చేయాలి'



మాట్లాడుతున్న కొరివి వేణుగోపాల్

సుభాష్‌నగర్, మే 21: గత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని 33 జిల్లాలుగా విభజించడంపై రాష్ట్ర ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ కోరారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలన్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఇష్టానుసారంగా జిల్లాలో విభజనను చేశారని దీనిపై కమీషన్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక ఇంటర్వ్యూలో మాట్లాడినట్లు చెప్పారు. కేసీఆర్ తెలంగాణ తన జాగీరులాగా ఇష్టానుసారంగా 33 జిల్లాలను ఏర్పాటు చేశారని, అందులో బాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాను ఎనిమిది ముక్కలుగా చేశాడన్నారు. దీని ప్రకారం చొప్పదండి నియోజకవర్గం, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లా, జగిత్యాల జిల్లాలో ఉందన్నారు. ఇది పరిపాలన పరంగా చాలా ఇబ్బందికరం అన్నారు. అభివృద్ధిగాని లాండ్ ఆర్డర్ సమస్యలు గాని సంబందిత ఎమ్మెల్యేలకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయన్నారు. రాష్ట్రంలో జిల్లాల విభజన శాస్త్రీయంగా జరిగిందని బీఆర్ఎస్ మాజీ మంత్రులు బహిరంగ చర్చకు వస్తే అందుకు తాను సిద్ధమన్నారు. ఉద్యమాలను దెబ్బతీసేందుకే కేసీఆర్ జిల్లాలను రాజకీయ కోణంలో 33జిల్లాలు చేశారని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని సవరణ చేయాలని కోరారు. జూన్‌లో ప్రజా మిత్ర ఆధ్వర్యంలో విభజపై రౌండ్ టెబుల్ సమావేశం నిర్వహించి ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి వరంగల్ జిల్లాల నుంచి మేధావులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో చిగిరి శ్రీదర్, గజ్జెల ఆనందరావు, బోయినపల్లి చంద్రయ్య, గజ్జెల రవీందర్, బాపురెడ్డి, చంద్రశేఖర్, రాములు, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

రైతులను విస్మరిస్తే పుట్టగతులుండవు





మానకొండూర్, గంగాధరలో రణభేరి దీక్ష చేస్తున్న బీజేపీ నాయకులు

మానకొండూర్, మే 21 : అమలు కాని హమీలతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి సర్కార్ రైతులను విస్మరిస్తే పుట్టగతుతులుండవని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుగొండ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. మానకొండూర్‌లో నియోజకవర్గ బీజేపీ రణభేరి రైతు దీక్ష మంగళవారం నిర్వహించారు. ఈ దీక్షలో ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిందన్నారు. రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయడంతో రైతులు కష్టించి పండించిన ధాన్యం అకాల వర్షానికి తడిసిపోయిందన్నారు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. క్వింటాల్ ధాన్యానికి 500 రూపాయల బోనస్, రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సన్న వడ్లకే బోనస్ చెల్లిస్తామని రాష్ట్రప్రభుత్వం మాట్లాడడం సిగ్గు చేటన్నారు. రైతులు పండించిన అన్ని రకాల ధాన్యానికి బోనస్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగేంత వరకు బిజేపి ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకట్‌రెడ్డి, రంగు భాస్కరాచారి, ఆయా మండలాల అధ్యక్షులు రాపాక ప్రవీణ్, సుగుర్తి జగదీశ్వరాచారి, శంకర్ నాయకులు పాల్గొన్నారు.

● గంగాధర1: సన్న, దొడ్డు రకాలని తేడా లేకుండా ధాన్యానికి ఐదు వందల రూపాయల బోనస్ అందించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల ప్రభాకర్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో రణభేరి ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయక రైతులనుమోసం చేసిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పెరుక శ్రవణ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ, జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు, అశోక్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

మానసాదేవి ఆలయంలో ఘనంగా వార్షికోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

గన్నేరువరం, మే 21: మండలంలోని ఖాసింపేట మానసా దేవి ఆలయ వార్షికోత్సవం మంగళవారంతో ముగిసింది. మూడు రోజుల పాటు కన్నుల పండువగా వేడుకలు జరిగాయి. మంగళవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అమ్మ వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. గునుకుల కొండాపూర్‌లో జరిగిన రేణుకా ఎల్లమ్మ జాతరలో ఎమ్మెల్యే పాల్గొని గ్రామ దేవతలైన పోచమ్మ, ఎల్లమ్మ తల్లులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, నాయకులు బద్దం సంపత్‌రెడ్డి, పరిపూర్ణాచారి, నేలపట్ల పర్శరాం, బేతెల్లి రాజేందర్, సుధగోని మల్లేశం పాల్గొన్నారు.

అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీనివాస్

హుజూరాబాద్, మే 21: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన అన్ని రకాల వడ్లకు క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ ఇవ్వాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం హుజూరాబాద్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రతీ రైతును కేసీఆర్ ఆదుకున్నారన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిసిపోయిందని, వీటిని మిల్లర్లు కొనుగోలు చేయక రైతులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఎన్నికల ముందు సన్నరకం వడ్లక బోనస్ ఇస్తానని చెబితే దొడ్డు రకం పండించే రైతుల ఓట్లు కాంగ్రెస్‌కు పడేవి కాదన్నారు. సమావేశంలో లావణ్య, రమ, సురేందర్‌రెడ్డి, అయిలయ్య, కొండాల్‌రెడ్డి, రమేష్, సమ్మన్న, శ్రీనివాస్, భాస్కర్, సదానందం పాల్గొన్నారు.

● మానకొండూర్: మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు, జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యాన్ని పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలు కాని హామీలతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యులు ఎండీ అమీరుల్లా ఖాన్, రామంచ గోపాల్‌రెడ్డి, పిట్టల మధు, యాదగిరి, వెంకటస్వామి, అనిల్, కిరణ్ పాల్గొన్నారు.

గీత కార్మికుడికి పరామర్శ

సుభాష్‌నగర్, మే21: తాటి చెట్టు నుంచి జారి పడి గాయపడిన గీత కార్మికుడిని గీతకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్ పరామర్శించారు. గంగాధర మండలం గర్శకుర్తి గ్రామానికి చెందిన గుర్రం అంజయ్య తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడటంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అంజయ్యను సర్వాయి పాపన్న గీతకార్మిక సంఘం అధ్యక్షుడు శంకర్ పరామర్శించారు.

రక్తదానం

సుభాష్‌నగర్, మే21: అరుదైన ఓ నెగటివ్ రక్తాన్ని 62వ సారి రక్తదానం చేసి తన ఉదారతను చాటుకున్నాడు. కరీంనగర్ పట్టణానికి చెందిన బేతి మహేందర్ రెడ్డి ఆపదలో ఉన్న వారికి తాను ఉన్నానంటు రక్తదానం చేసి వారి ప్రాణాలను కాపాడుతూ వస్తున్నాడు. గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ గ్రామానికి చెందిన పంజాల జలజ ప్రసవం నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. అయితే ఆమెకు ప్రసవ సమయంలో అధిక రక్త స్రావం కావడంతో ఆమెకు ఓ నెగటివ్ రక్తం కావాలని తెలిపారు. దీంతో డాక్టర్‌ల సూచనల మేరకు కుటుంబీకులు బీజేవైయం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి శశిధర్‌రెడ్డిని సంప్రదించగా ఈ విషయాన్ని ఆయన బేతి మహేందర్‌రెడ్డికి తెలియచేశారు. మహేందర్ రెడ్డి వెంటనే స్పందించి రక్తదానం చేశాడు. ఈసందర్భంగా అసోసియేషన్ న్యాయవాదులు, డివిజన్ ప్రముఖులు, బీజేపి పార్టీ శ్రేణులు ఆయన్ని అభినందించారు.

'మాజీ డిప్యూటీ మేయర్‌పై ఆరోపణలు అవాస్తవం'

కరీంనగర్ టౌన్, మే 21: దళితయువకుడిపై దాడి కేసులో ఎంఐఎం నాయకుడు, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ ప్రమేయమేమి లేదని, ఆయనపై ఆరోపణలు అవాస్తవమని ఖాన్‌పుర, హుస్సేనిపుర దళిత నాయకులు ఒక ప్రకటనలో ఖండించారు. రాజకీయ లబ్ధి కోసమే అబ్బాస్ సమీపై ఆరోపణలు చేశారని, వివాదాన్ని ప్రశాంతంగా పరిష్కరించేదుకు కుల పెద్ద మనిషిగా సమీ కృషి చేస్తే భూతద్దంలో చూసి బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఖండించారు. దళిత, ముస్లింలను తారతమ్యం లేకుండా సమాన దృష్టితో చూసే సెక్యూలర్ లీడర్ అబ్బాస్ సమీ అని, బాధిత దళిత యువకుడిని తిరిగి విచారించి దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు పోలీసు కమిషనర్‌ను కోరారు.

ఉద్యోగులకు డీఏలు చెల్లించాలి

కరీంనగర్ టౌన్, మే 21: రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు, ఉపాధ్యాయులకు పెండింగ్ బిల్లులను, నాలుగు డీఏలను వెంటనే ఇవ్వాలని రిటైర్డు గెజిటెడ్ ఉపాధ్యాయుడు జాలి మహేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

వీటిపై ప్రభుత్వం స్పందిస్తేనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థికి ఉపాధ్యాయులు, ఉద్యోగులు, గ్రాడ్యుయేట్లు ఓట్లు వేసి గెలిపిస్తారని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగ యువత సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్సీ అభ్యర్థులు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ నేతలు

కరీంనగర్ టౌన్, మే 21: వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో జిల్లాకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొంటున్నారు. మేయర్ యాదగిరి సునీల్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్‌తో పాటు పలువురు నాయకులు పట్టభద్రుల నియోజక వర్గంలోని వారికి కేటాయించిన ప్రాంతాల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహిస్తున్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

సుభాష్‌నగర్, మే21: వాగ్దేవి వనిత క్లబ్ అధ్యక్షురాలు మాడిశెట్టి ఉమాదేవి, మాడిశెట్టి గోపాల్ పెళ్లి రోజును పురస్కరించుకుని నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. మంగళవారం నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గల వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధుల ఆశ్రమంకు నిత్యావసర వస్తువులు, వృద్ధులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో క్లబ్ జిల్లా గవర్నర్ జంధ్యం మాదవి, ఐపీసి చంద రవీందర్, క్లబ్ కార్యదర్శి యం స్వరూప, భగత్ నగర్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం అధ్యక్షుడు హరిప్రసాద్, వి. రాజమణి, వి.వెంకటేశం, మాడిశెట్టి సాకేత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

జమ్మికుంట, మే 21: ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సమక్షంలో హైదరాబాద్‌లో జమ్మికుంటకు చెందిన చంద్రగిరి శ్రీనివాస్ మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు ఎమ్మెల్సీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు కసుబోజుల వెంకన్న, చిన్నింటి నాగేంద్ర, తంగెళ్ల రాజు, చిక్కుడు శంకర్ పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

మానకొండూర్, మే 21: మండలంలోని ముంజంపల్లిలో కొనసాగుతున్న రేణుకా ఎల్లమ్మ బ్రహ్మోత్సవాల్లో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నందగిరి రవీంద్రాచారి, ఆలయ కమిటీ అధ్యక్షులు ఏగోలపు శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు సంపత్, శంకర్, తిరుపతి, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్నకొండ పంచాయతీలో రికార్డుల పరిశీలన

చొప్పదండి, మే 21: మండలంలోని ఆర్నకొండ గ్రామ పంచాయతీ రికార్డులను మంగళవారం సీసీఆర్ సంస్థ పరిశీలించింది. ఈ సందర్భంగా ఆర్నకొండ గ్రామ పంచాయతీకి వచ్చిన నిధులు ఖర్చులు, రిజిస్టర్లు, అభివృద్ధి పనులు, తదితర పత్రాలకు సంబంధించిన రికార్డులను కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్- అవినీతి నిర్మూలన, పౌర, మానవ హక్కుల జాతీయ సంస్థ పరిశీలించింది. నివేదికను జిల్లా, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ శాఖలకు, కోర్టులకు సమర్పిస్తామని సంస్థ తెలిపింది. కార్యక్ర మంలో సీసీఆర్ కేంద్ర కమిటీ సభ్యుడు భూక్య చరణ్‌కాంత్, కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్ రికార్డుల తనిఖీల విభాగం కేంద్ర కమిటీ సభ్యులు పూరి రత్నాకర్, గుండ్ల శివచంద్రం, రాష్ట్ర కమిటీ సభ్యులు భూక్య చంద్రకాంత్, ఎస్ భరద్వాజ్, జోనల్ సెక్రెటరీ తాళ్ల సురేష్, జై రవీందర్, పి రాము, ఆకుల సంజీవరావు సభ్యులు పాల్గొన్నారు.

'ఎన్జీటీ తీర్పు గత ప్రభుత్వానికి చెంప పెట్టు'

జమ్మికుంట, మే 21: మానేరు నదిలో ఇసుక తవ్వకాలు చట్ట విరుద్ధమని ఎన్జీటీ ఇచ్చిన తీర్పు గత ప్రభుత్వానికి చెంప పెట్టు లాంటిదని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన జమ్మికుంటలో విలే కరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలపై అధికారులు, నాయకులు మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఇసుక మాఫియాతో కుమ్మక్కై వేల కోట్ల రూపా యాల అక్రమాలకు పాల్పడ్డారన్నారు. అవినీతికి వ్యతిరేకంగా తాను రైతాంగం పక్షాన ఉద్యమించినట్లు గుర్తు చేశారు. తాను సాక్ష్యాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశానని, ప్ర స్తుతం విచారణ జరుగుతుందన్నారు.

ఎన్జీటీ విధించిన 50 కోట్ల రూపాయల జరిమానాను అక్రమాలకు పాల్పడిన అధి కారుల నుంచి వసూళు చేసి, మానేరు తీర ప్రాంత బాధిత రైతాంగానికి నష్టపరిహారంగా చెల్లించాలన్నారు. పోరాడి విజ యం సాధించిన మానేరు పరిరక్షణ సమితి నాయకులు సంది సురేందర్‌రెడ్డి, చిటికేసి సతీష్‌కుమార్‌ను అభినందించారు.